## క్లుప్తంగా

### సూగూర్‌లో నందికోల సేవ



పెబ్బేరు: మండలంలోని సూగూర్‌లో వీరభద్ర స్వామి ఆలయంలో అరంజ్యోతి పనికుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నందికోల సేవా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళ వారం కృష్ణ జలాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణతో పూజలు జరిపి భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు కర్నూల్ జిల్లాకు సంబంధించిన బాజా భజంత్రీ, భజన బృందాలు నందికోల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవారి సేవకులు సితార వెంకటేశ్వర్లు, బాలరాజుగౌడ్, జయన్న, శ్రీనివాసులు, ధనంజేయుడు, రాములు, మాధవుడు, రఘు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు రాంచంద్రయ్య కుమార్తె స్వాతి వివాహానికి సర్పంచ్ మౌనిక యాదవ్ రూ. 2,500 విలువవైన దుస్తులు, రూ.5వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడి కుమార్తె వివాహానికి సాయం అందించిన పర్పంచ్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో తిరుపతియాదవ్, డా.తిరుపతయ్య, చంద్రయ్య, కృష్ణయ్యయాదవ్, మైబూషి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం



పెబ్బేరు రూరల్: వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై మండల బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి మండలంలోని రాజపేటలో బుధవారం రాత్రి డాక్యుమెంటరీ ప్రదర్శించారు. ముఖ్యమంత్రి చేపడుతున్న అభివృద్ధి పనులు, ఆయన ప్రసంగం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రయోజనాలు తదితర విషయాలను పొందుపరిచారు. కార్యక్రమానికి ఎన్నికల సమన్వయకర్త వంగూర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి మండల, స్థానిక నాయకులతో కలిసి ప్రదర్శనను తిలకించారు. అనంతరం గ్రామస్తులకు భోజనం ఏర్పాటు చేశారు.

### పింఛనర్లకు న్యాయం చేయాలి



ఆత్మకూర్: దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు ప్రతి నెల వచ్చే పింఛన్ డబ్బుల్లో కమీషన్ తీసుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎంపీఓ నర్సింగ్‌రావుకు మోట్లంపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. పింఛన్ పంపిణీదారుడిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుల్లన్న, బద్రీనాథ్, భగవాన్, ఉపేందర్, గోపాల్, మణ్యం, శ్రీను తదితరులు ఉన్నారు.

### వ్యక్తి బైండోవర్



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లికి చెందిన కావలి భగవంతు గ్రామ శివారులో అక్రమంగా సారా తయారు చేసి విక్రయిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కిషన్ ఎదుట భగవంత్‌ను బైండోవర్ చేశారు. మండలంలో అక్రమంగా సారా తయారు చేసినట్టు తెలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ కానిస్టేబుల్ శివకుమార్ తెలిపారు.

### 'సేవాభావంతో పనిచేస్తా'

వీపనగండ్ల: కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు వైద్యుడిగా ఎన్నో సేవలు అందించానని, ఈ దఫా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసే తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సేవాభావంతో పనిచేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగిడాల శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బుధవారం బొల్లారం గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

**వనపర్తి టౌన్:** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో బుధవారం ఆడపడుచుల సందడి చేశారు. తమ సోదరులకు కట్టే రాఖీలను కొనుగోలు చేయడానికి దుకాణాలకు చేరుకోవడంతో రహదారులు రద్దీగా మారాయి. దుకాణదారులు యువతులు, మహిళలను ఆకర్షించేందుకు దుకాణాల ఎదుట స్టాల్స్ ఏర్పాటు చేసి రకరకాల రాఖీలను అందుబాటులో ఉంచారు. రూ. 10 నుంచి రూ. వెయ్యి విలువ గల రాఖీలు మార్కెట్‌లో ఉన్నాయి.

**ఆత్మకూర్:** పట్టణంలోని దుకాణాల్లో రాఖీల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. రాఖీల షాపులన్నీ కొనుగోలుదారులతో కిక్కిరిసి పోయాయి. పిల్లలకు ఇష్టమైన స్పైడర్‌మెన్, లైటింగ్ రాఖీలు, హనుమాన్, చోటాభీమ్, మైఫ్రెండ్, గణపతి రాఖీలు లభిస్తున్నాయి.

**ఏబీవీపీ ఆధ్వర్యంలో..**

సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని ఆర్‌ఎస్‌ఎస్ కార్యదర్శులు భగవంతురెడ్డి, మహేందర్‌జీ అన్నారు. నేను నీకు రక్ష.. నాకు నీవు రక్ష.. మనమందరం దేశానిక రక్ష అనే నినాదంతో ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రైవేటు కళాశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, రవివర్మ, అఖిల్, రాజేష్, సందీప్, మహేష్, భరత్, రాజేష్, వంశీ, విద్యార్థులున్నారు.

**ఖిల్లాఘనపురం:** అన్నా చెల్లెల్ల అనుబంధానికి ప్రతీకే రక్షాబంధన్ అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాధ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ అన్నారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆనంద్, ఆశన్న, పురుషోత్తం ముదిరాజ్, వెంకటేష్, కిశోర్, శివశంకర్, గోపి, దీపక్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థినులు

**అమరచింత:** పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. శ్రీసరస్వతి శిశు మందిర్, విజేత హైస్కూల్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఒకరికొకరు రాఖీలను కట్టుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రాఖీలు కట్టి తమ అనురాగం చాటుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహమ్మద్ ఖాజాకు చిన్నారులు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు రాఖీలు కట్టుకుని ఒకరికి ఒకరం రక్షా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వినోద్, రవివర్మ, అఖిల్, రాజేష్, సందీప్, తాటికొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తకోట:** పట్టణ కేంద్రంలోని అరుణోదయ కాన్సెప్ట్ స్కూల్‌లో బుధవారం రాఖీ వేడుకలను ఘనగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు రాఖీలు కట్టి స్వీట్లు పంచిపెట్టారు. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం వేడుకల్లో పాల్గొని రాఖీలు కట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం అశోక్‌కుమార్, చీర్ల రమేష్ ఉన్నారు.



అమరచింతలో..



వనపర్తిలో..



ఆత్మకూర్‌లో..



అమరచింత విజేత ఉన్నత పాఠశాలలో..

### ఘనంగా బోనాల పండుగ



గోపాల్‌పేట: మండల కేంద్రంలో బుధవారం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో బోనమెత్తారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు సమర్పించారు.

### 'చలో హైదరాబాద్' జయప్రదం చేయండి

పాన్‌గల్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు గడ్డం మురళి, లక్ష్మణ్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 30 శాతం ఐఆర్ ప్రకటించి పీఆర్సీ కమీషన్ వేయాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి బదిలీలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరణ, 22 వేల ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్, ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం

**వనపర్తి:** సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అక్రమ మానవ రవాణ నివారణ విభాగం ఎస్‌ఐ అంజాద్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి హాజరై సైబర్ నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం షీటీమ్స్, డయల్ 100, ట్రాఫిక్‌రూల్స్, ఉమెన్ సేఫ్టీ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదువుకుంటూ ముందుసాగాలన్నారు. విద్యార్థి దశ నుంచి భవిష్యత్ లక్ష్యం ఏర్పాటు చేసుకుని కష్టపడాలని సూచించారు. సోషల్ మీడియాలో గుర్తుతెలియని వారితో చాటింగ్ చేయవద్దని, ఇతరులు పెట్టే మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువులు కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆన్‌లైన్, బ్యాంక్ సేవల మోసాలు, వాట్సాప్, ట్విట్టర్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అసంఘటిత కార్మికులకు రక్షణ కల్పించాలి

**అమరచింత:** అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలంటూ వచ్చే నెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్ తెలిపారు. పట్టణంలోని జీఎస్ భవనంలో బుధవారం సీఐటీయూ మండల సమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటితరంగ కార్మికులకు ఇప్పటి వరకు సమగ్రమైన చట్టం తీసుకురాకుండా కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందని ఆరోపించారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం అసంఘటిత రంగ కార్మికులందరూ పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో బుచ్చన్న, ప్రభాకర్, సంధ్య, రవి, రమేష్, తిరుమలేష్ పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్:** తెలంగాణ వస్తే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం ఉండదని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఇప్పుడెందుకు వాటిని కొనసాగిస్తున్నారని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ యోసేపు, జేఏసీ చైర్మన్ వేణుగోపాల్ ప్రశ్నించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను పూర్తిగా ఎత్తివేసి రెగ్యులరైజ్ వ్యవస్థను ఒక్కటే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ సమీపంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరహార దీక్షలకు వారు మద్దతు ప్రకటించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షణ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. సమగ్ర శిక్షణ ఉద్యోగుల దీక్షకు పలువురు అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు మద్దతు తెలిపారు.



అమరచింతలో మాట్లాడుతున్న రమేష్

### తాగునీటి కోసం రాస్తారోకో

**అమరచింత:** వర్షాకాలంలో సైతం తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, తమ కాలనీలకు తాగునీరు రావడం లేదంటూ పట్టణంలోని ఆరో వార్డు మహిళలు, ప్రజలు బుధవారం రోడెక్కి రాస్తారోకో నిర్వహించారు. మున్సిపాలిటీలోని ఆరు, ఏడో వార్డులకు రెండు నెలలుగా తాగునీటి ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోక పోవడంతో మహిళలు రోడెక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆత్మకూర్, మరికల్ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు రెండు గంటల పాటు స్తంభించాయి. ఈమేరకు సీపీఎం జిల్లా నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ వేసవి కాలంలో కాలనీలో ఎండిపోయిన సోర్స్ బోర్‌లకు మరమ్మతు చేపట్టలేదని, మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ రావడం లేదని, సరైన పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు సకాలంలో అందటం లేదన్నారు. అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించే వరకు రాస్తారోకోను విరమించేది లేదని భీష్మించి కూర్చున్నారు. సంఘటన స్థలానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా చేరుకొని తాగునీటి సమస్యలను త్వరితంగా పరిష్కరిస్తామని, సోర్స్‌బోర్‌లకు మరమ్మతు చేపట్టి తాగునీటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వెంకటేష్, సురేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

### హామీలు అమలు చేయాలి



పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు మంత్రి సత్యవతి రాథోడ్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, శారద డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీ టీ చర్లు, ఆయాలతో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నారాయణమ్మ, కోశాధికారి రా.ద, జ్యోతి, సుమతి, లలిత, వరలక్ష్మి, గోవిందమ్మ, శారద, అరుణ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

### 18 మందికి జరిమానా

**అమరచింత:** మద్యం తాగి వాహనాలను నడుపుతున్న 18 మంది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలను నడుపరాదని డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నా కొంతమంది మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం**

చిన్నచిన్న తగదాలతో కేసుల్లో ఇరుక్కున వారికి లోక్ అదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకొనే అవకాశం ఉందని ఎస్‌ఐ తెలిపారు. దీర్ఘకాలికంగా కేసులు పరిష్కారానికి నోచుకోని వారందరూ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### పంటను ధ్వంసం చేసిన వ్యక్తులకు రిమాండ్

**అమరచింత:** సాగు చేసిన మూడు ఎకరాల పత్తి పంటను నాశనం చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. మండలంలోని కొంకన్‌వానిపల్లి శివారులో సర్వే నంబర్ 144లో పెద్ద గొల్ల లింగన్న మూడు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. అదే గ్రామానికి చెందిన గొల్ల మల్లేష్, మాసన్న ట్రాక్టర్‌తో పొలాన్ని చదును చేసి నష్టపరిచారని బాధితుడు పెద్ద గొల్ల లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మూడేళ్లుగా ఇదే పనిగా సాగుచేస్తున్న పంటను సదరు వ్యక్తులు నాశనం చేస్తున్నారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

## ముందస్తు అరెస్టులకు భయపడం

**ఖిల్లాఘనపురం:** సూర్యాపేటకు చెందిన వట్టె జానయ్యపై మంత్రి గుంతకండ్ల జగదీష్ అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన చలో సూర్యాపేట కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని బీఎస్పీ నాయకులను బుధవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. కార్యక్రమానికి వెళతారనే అనుమానంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు గోపి ముదిరాజ్ తో పాటుగా పలువురు నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకుల ఆగడాలు ఎక్కువ అయ్యాయని ధ్వజమెత్తారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టి ఇబ్బందులు పెడతారా అంటూ నిరసన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరనేది త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలుస్తుందన్నారు.

**పెబ్బేరు రూరల్:** సూర్యాపేటకు తరలి వెళ్తున్న బీఎస్పీ నాయకులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఘనపురం కృష్ణయ్య మాట్లాడుతూ సూర్యాపేటలో జానయ్యయాదవ్‌పై మంత్రి జగదీశ్‌రెడ్డి చేస్తున్న అరాచకాలను ప్రశ్నిస్తూ బాధిత కుటుంబానికి అండగా నిలబడతామన్నారు. బీఆర్‌ఎస్ నాయకత్వానికి ప్రజలపై ప్రేమ ఉంటే మంత్రి జగదీశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంబాబు, ఎల్లస్వామి, రాముడు, ఎర్రం భరత్, గంధం అరుణ్‌కుమార్, వేణు, మనోహర్, రాంచంద్రి, లోకేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



పెబ్బేరులో బీఎస్పీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

## సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయం

**పెబ్బేరు రూరల్:** ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాలని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం వనపర్తి మండల నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిన్నారెడ్డి మాట్లాడుతూ సోనియాగాంధీ ద్వారానే తెలంగాణ కల సాకారం అయిందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ నాయకులు రూ.కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. వనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ అధిష్టానం చూసుకుంటదని, ఎవరికి టికెట్ వచ్చినా అందరం కలసికట్టుగా పనిచేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బడుగు బలహీన వర్గాలకు మేలు జరిగే విధంగా విధానాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, మండల అధ్యక్షుడు వెంకటనారాయణ, వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, పట్టణ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు చీర్ల జనార్దన్, సర్పంచ్ మురళినాయక్, శివనాయక్, రాములు, కర్ణాకర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిమనగుంటపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

**వీపనగండ్ల:** రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడంతో పేదలకు మేలు జరుగుతుందని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, ఎత్తం కృష్ణయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీరయ్య యాదవ్ అన్నారు. బుధవారం కల్వరాలలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొని వారు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కల్వరాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, తిరిగి ఆయన నాయకత్వాన్ని బలపరచడం వల్ల గ్రామానికి మేలు జరుగుతుందని పలువురు అన్నారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, నర్సింహ, బస్వరాజ్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన

**పాన్‌గల్:** ఉపాధ్యాయులు నూతన పద్ధతులను అవలంబిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని రాయినిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం పంపిణీ, చిన్నారుల హాజరు శాతాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని పకడ్బందీగా పంపిణీ చేయాలన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

## మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడి



మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి నినాదాలు చేస్తున్న ఆశా వర్కర్లు

**వనపర్తి టౌన్:** ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆశా వర్కర్లు మంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడించారు. ర్యాలీగా వచ్చిన ఆశా కార్యకర్తలు క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించడంతో విషయం తెలుసుకున్న పోలీసులు గేట్‌ను మూసేయడంతో క్యాంప్ కార్యాలయం ఎదుటే ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ కనీస వేతనాలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఆశా వర్కర్‌లను కనీస వేతనం రూ. 18వేల ఇవ్వడంతో పాటుగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్‌ల సమస్యలను పరిష్కరించకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆశాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ, శ్యామల, బాలమణి, చిట్టెమ్మ, కల్పన, చెన్నమ్మ, రాగామ్మ, నసీన్, రేణుక, లత, సీఐటీయూ నాయకులు నందిమల్ల రాములు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

**పీహెచ్‌సీ సూపర్‌వైజర్‌కు వినతి**

**పాన్‌గల్:** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశా కార్యకర్తలకు ఇస్తున్న పారితోషాకాన్ని రూ.18వేలకు పెంచాలని కోరుతూ బుధవారం మండల ఆశా కార్యకర్తలు పీహెచ్‌సీ సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సుజాత, రేణుక, రామేశ్వరమ్మ, మహేశ్వరి, గోవిందమ్మ, అరుణ, భాగ్య, సువర్ణ, శివరాణి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌ఎంల సేవలు అభినందనీయం



పెబ్బేరు రూరల్: కరోనా ఎంతో భయకరమైన వ్యాధి అని తెలిసినప్పటికీ ఆ సమయంలో ఏ మాత్రం భయపడకుండా ఏఎన్‌ఎంలు అందించిన సేవలు అభినందనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో రెండో ఏఎన్‌ఎంల చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 15వ రోజుకు చేరింది. బీఎస్పీ, సీపీఎం ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంల దీక్షకు మద్దతు ప్రకటించారు. శిబిరంలో నాయకులకు రాఖీలు కడుతూ ఏఎన్‌ఎంలు వినూత్న నిరసన తెలిపారు. ఏఎన్‌ఎంల యొక్క న్యాయమైన డిమాండ్లను తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా బీఎస్పీ గౌరవ అధ్యక్షుడు చెన్నరాములు అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ మాట్లాడుతూ 16 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న వారిని ఎలాంటి ఆంక్షలు లేకుండా క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, లక్ష్మమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోస, సుమిత్ర, పార్వతి, రాధ, శ్రీదేవి, శారద, లావణ్య, లలిత, ధర్మ సమాజ పార్టీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.